ఈనాడు మహబూబ్‌నగర్

ఆదివారం సెప్టెంబరు 29, 2024 5

విద్యార్థులు, యువతే ప్రచార తారలు

యువ క్లబ్‌ల ద్వారా పాలమూరు పర్యాటకంపై దృష్టి ● ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 1,397 ఏర్పాటు

మహబూబ్‌నగర్ సమీపంలో పిల్లల మర్రికి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉంది. ఈ మహా వృక్షం ఊడలు ఎక్కడ మొదలయ్యాయో ఎవరూ కనుక్కోలేకపోయారు. దేశంలోనే ప్రసిద్ధి పొందిన పిల్లలమర్రి గురించి నేటి తరానికి తెలిసింది తక్కువే. ప్రధానంగా విద్యార్థులు, యువతకు పిల్లలమర్రి ప్రాముఖ్యత తెలియదు. మన ప్రాంతంలోనే ఉన్న దీని ప్రాముఖ్యతను తెలుసుకుని భవిష్యత్తు తరాలకు తీసుకెళ్లే బాధ్యతను జిల్లాలోని విద్యార్థులు, యువకులు తీసుకోనున్నారు.

నారాయణపేట జిల్లా కృష్ణా మండలం ముడుమాల్‌లో నిలువురాళ్లు 80 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయి. 80 వరకు గండశిలలు ఒక్కోటి 14 అడుగుల వరకు ఉంటాయి. వీటి ద్వారా ఆదిమ మానవులు వాతావరణ మార్పులు తెలుసుకునేవారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న నిలువురాళ్ల గురించి స్థానికులకు కూడా పూర్తి స్థాయిలో సమాచారం లేకపోవడం గమనార్హం. ఇప్పుడు దీని బాధ్యతను అక్కడి విద్యార్థులు, యువత తీసుకోనున్నారు.





ఈనాడు, మహబూబ్‌నగర్: రాష్ట్ర పర్యాటకశాఖ సమన్వయంతో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న యువ టూరిజం క్లబ్‌లు(వైటీసీ) స్థానిక విద్యార్థులు, యువతను కొత్త ఆలోచనల వైపు నడిపించనున్నాయి. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,397 వైటీసీలను ఏర్పాటు చేశారు. వీటిలో మొత్తం 34,925 మంది విద్యార్థులు, యువకులు భాగస్వామ్యం కానున్నారు. కేవలం మహబూబ్‌నగర్ జిల్లాలోనే 1,317 క్లబ్‌లు ఏర్పాటు చేశారు. మిగతా నాలుగు జిల్లాల్లో ప్రస్తుతం ఉన్న క్లబ్‌లను పెంచడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు.

బాధ్యత వీరిదే..: నంద వంశం నుంచి అసఫ్ జాహీ వంశం వరకు 22 ప్రముఖ రాజవంశాలు ఈ ప్రాంతాన్ని పాలించాయి. హరిహర, శక్తి కేంద్రాలకు పాలమూరు ఎంతో ప్రసిద్ధి. ముస్లింలు పవిత్రంగా భావించుకునే దర్గాలకు కొదవలేదు. కృష్ణా, తుంగభద్ర నదులు ఇక్కడి నుంచే ప్రవహిస్తాయి. నల్లమల ప్రకృతి సౌందర్యం ఇట్టే కట్టిపడేస్తాయి. వనపర్తి, గద్వాల, కొల్లాపూర్, ఆత్మకూరు, గోపాలపేట సంస్థానాలకు గుర్తింపు ఉంది. పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 34 ప్రాంతాలను వారసత్వ, చారిత్రక, ఆధ్యాత్మిక కేంద్రాలను పర్యాటకశాఖ గుర్తించింది. ఈ సంపదను కాపాడటం, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ఈ యువ టూరిజం క్లబ్‌లు పని చేయనున్నాయి.

ఒక్కో క్లబ్‌లో 25 మంది..: ఈ క్లబ్‌ల ఏర్పాటు ద్వారా స్థానిక విద్యార్థులు, యువతకు పర్యాటక ప్రాముఖ్యతపై పూర్తి స్థాయి అవగాహన కల్పించనున్నారు. మొదటి దశలో క్లబ్‌ల ఏర్పాటు, రెండో దశలో పర్యాటకంపై వివిధ దశల్లో పోటీలు నిర్వహించనున్నారు. మూడో దశలో ఈ క్లబ్‌లు క్షేత్రస్థాయికి వెళ్లి సంస్కృతి, సంప్రదాయాలకు పర్యాటక రంగాలు ఎలా ఉపయోగపడతాయి? వీటి పరిరక్షణ ఎలా చేయాలి? వంటి వాటిపై దృష్టి పెడతారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల స్థాయిలో ఒక్కో క్లబ్‌ను 25 మందితో ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి క్లబ్‌కు అందులోని విద్యార్థియే నాయకుడిగా, ఆ విద్యాలయంలో పనిచేసే ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. దీనిపై మహబూబ్‌నగర్ పర్యాటకశాఖ అధికారి వెంకటేశ్వర్లు 'ఈనాడు'తో మాట్లాడుతూ ఈ క్లబ్‌ల ఏర్పాటుతో పాలమూరు పర్యాటకానికి మరింత గుర్తింపు రావడంతోపాటు విద్యార్థులు, యువతకు వారసత్వ సంపదపై అవగాహన కలుగుతుందన్నారు.

జిల్లా	టూరిజం క్లబ్‌లు	విద్యార్థులు, యువత
మహబూబ్‌నగర్	1,317	32,925
నాగర్‌కర్నూల్	37	925
జోగులాంబ గద్వాల	12	300
నారాయణపేట	19	475
వనపర్తి	12	300

నల్లకుంటలో మురుగు శుద్ధి కేంద్రం

ప్రయోగాత్మకంగా జడ్చర్లలో అమలుకు చర్యలు



నల్లకుంట వద్ద ఏర్పాటు చేస్తున్న మురుగు నీటి శుద్ధి యంత్రం

జడ్చర్ల, న్యూస్‌టుడే: జిల్లాలో మొదటిసారిగా మురుగు నీటిని శుద్ధి చేసే ప్లాంటును జడ్చర్లలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్నారు. ఒకప్పుడు నల్లకుంట అంటే మురుగు కుంట. దాన్ని భారాస ప్రభుత్వ హయాంలో మినీ ట్యాంకుబండ్‌గా మార్చారు. పక్కన ఉద్యానవనం, నడక కోసం వచ్చేవారికి ట్రాక్ ఏర్పాటు చేశారు. కుంటలోకి నీరు చేరే మార్గం మాత్రం లేకుండా పోయింది. బాదేపల్లిలోని రైల్వే ట్రాక్ పక్కన ఉన్న ఈ నల్లకుంటలో కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం ద్వారా పురపాలికలోని మురుగు, వర్షపు నీటిని శుద్ధి చేసేందుకు యంత్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

నల్లకుంటలో ఒక భాగం మినీ ట్యాంకుబండ్‌గా మార్చాక కట్టను తెంపి వర్షాలు వచ్చినప్పుడు నీటిని బయటకు వదలడంతో ప్రధాన రహదారిపైకి రాకపోకలకు ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. ఇటీవల వర్షాల సందర్భంగా జడ్చర్ల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వర్షపు నీటిని నల్లకుంటలోకి మళ్లించాలని నీటి పారుదల శాఖ, పురపాలిక అధికారులను సూచించారు. ఇక్కడ వైపు వేసి నీటిని తరలించడంతో సగం వరకు కుంట నిండింది. అమృత్ పథకంలో మురుగు శుద్ధి కేంద్రం ఏర్పాటుకు అవకాశం ఉండటంతో ఇందుకు నల్లకుంటను ఎంపిక చేశారు. ఇక్కడ మురుగును శుద్ధిచేసే యంత్రాన్ని బిగిస్తున్నారు. ఈ యంత్రం రోజూ వచ్చే మురుగు, వర్షపు నీటిని కుంటలోకి వెళ్లే క్రమంలో శుద్ధి చేయడంతో పాటు చెత్తను తొలగిస్తుంది. ఈ నీటిని ఇక్కడ ఉన్న ఉద్యానవనంలోని మొక్కలు, చెట్లకు వినియోగించేందుకు చర్యలు చేపడతారు. నల్లకుంటలోకి శుద్ధినీరు ఉంటే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగి చుట్టుపక్కల ఇళ్ల వాళ్లకు తాగునీటి సమస్య తలెత్తదు. ఈ ప్రయోగం ఫలిస్తే నల్లకుంట, అక్కడి ఉద్యానవనం పట్టణవాసులకు ఆహ్లాదం పంచే అవకాశముంది. వర్షం వచ్చినప్పుడు ఇక్కడి నీరు నేతాజీచౌక్ ప్రధాన రహదారిపైకి రావటమనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. త్వరలోనే పనులు పూర్తవుతాయని పురపాలిక కమిషనర్ రాజయ్య తెలిపారు.



నల్లకుంటలోకి చేరిన వర్షపు నీరు

ఔషధాల కొరత.. రోగులకు వెత

ప్రభుత్వం నుంచి ఆసుపత్రులకు నిలిచిన సరఫరా



న్యూస్‌టుడే, పాలమూరు: మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఔషధాల కొరత తీవ్రమైంది. ప్రభుత్వం సకాలంలో సరఫరా చేయకపోవడంతో ఆసుపత్రి వర్గాలు బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఓపీ సేవల కోసం నిత్యం ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి 2వేలకు పైగా రోగులు వస్తున్నారు. 650 పడకలున్న ఈ ఆసుపత్రిలోని వార్డులన్నీ రోగులతో కిక్కిరిసిపోయాయి. అవసరం మేరకు ఔషధాలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

మూడు రోజులకే మందులు..: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు వైద్యులు పరీక్ష చేసిన తర్వాత ఐదు రోజులకు సరిపడా మందులు ఇవ్వాలి. ఇప్పుడు మూడు రోజుల మందులతోనే సరిపెడుతున్నారు. జనరల్ ఆసుపత్రికి ప్రభుత్వం నుంచి ప్రధానమైన ఔషధాలు కూడా సరఫరా కావడం లేదు. మధుమేహం, వాంతులు, గ్యాస్, మూర్ఛ, మత్తుమందులు, పలు రకాల స్టెరాయిడ్స్, విషం విరుగుడు, నొప్పి నివారణ మందులు, కాల్షియం, మల్టీ విటమిన్ మాత్రలు, గర్భిణులకు అవసరమైన ఔషధాలు, డ్రెస్సింగ్ వాడాల్సిన వస్తువులు, యాంటిబయాటిక్స్, ప్రయోగశాలలో వాడే రసాయనాలు, రక్త పరీక్షల సొల్యూషన్స్, కిట్ల సరఫరా నిలిచిపోయింది. వాటిని ఆసుపత్రి వర్గాలు బయట కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.



అత్యవసర విభాగంలో వైద్యసేవలు పొందుతున్న రోగులు

దూరం నుంచి వస్తే..: నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన పుష్పమ్మ తన తల్లి యాదమ్మకు జ్వరం వస్తే మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. పరీక్ష చేశాక వైద్యులు మందులు రాశారు. మందుల కేంద్రం వద్దకు వెళ్తే రెండు రోజులకే జ్వరం మాత్రలు ఇచ్చారు. ఎంతో దూరం నుంచి వస్తే తగినన్ని మందులు కూడా ఇవ్వలేదని వారు తల్లీకూతుళ్లు ఆవేదన వ్యక్తంచేశారు.



తన తల్లికి కొన్నే మందులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేస్తున్న పుష్పమ్మ

సిరంజీలూ కరవే

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని 30 విభాగాల్లో రోగులకు సిరంజీలతో వైద్యం చేస్తున్నారు. ఇంజక్షన్లు ఇవ్వడానికి, సెలైన్ ఎక్కించడానికి, రక్త పరీక్షలు చేయడానికి, రోగులకు మత్తు మందు ఇవ్వడానికి, రక్త నమూనాలు తీసుకోవడానికి సిరంజీలు, సూదులు అవసరం. ప్రభుత్వం నుంచి మూడు నెలల నుంచి సరఫరా లేదు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిత్యం 2,500 సిరంజీలు అవసరం అవుతున్నాయి. రోజూ 25 సిరంజీ పెట్టెలు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కోదానిలో 100 సిరంజీలు ఉంటాయి. బాక్సు ఖరీదు రూ.240. ఇలా రోజు సిరంజీలను కొనుగోలుకే రూ.6వేలు ఖర్చు చేస్తున్నారు. మూడు నెలల నుంచి రూ.5.40లక్షలు సిరంజీలకు వెచ్చించారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు : ప్రభుత్వం నుంచి ఔషధాల సరఫరా నిలిచింది. తగిన స్థాయిలో ఔషధాలు నిల్వ లేకపోవడంతోనే మూడు రోజులకు సరిపోయేలా అందిస్తున్నాం. మా వద్ద లేని మందులు బయట కొనుగోలు చేసి రోగులకు వైద్య సేవలు చేస్తూ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే ఔషధాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

- డా.సంపత్‌కుమార్ సింగ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మహబూబ్‌నగర్

గ్రామీణ ఓటర్లు 5,16,183

పురుషుల కంటే 1,118 మంది మహిళలు ఎక్కువ



ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి పార్థసారథి

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారులు పంచాయతీ ఓటర్లకు సంబంధించిన తుది జాబితాను శనివారం ప్రచురించారు. డీపీవో కార్యాలయంతో పాటు జిల్లాలోని 441 గ్రామ పంచాయతీల్లో నోటీసు బోర్డుపై పొందుపరిచారు. అసెంబ్లీ ఎన్నికలకు 2024 ఫిబ్రవరిలో ప్రచురించిన తుది జాబితా ఆధారంగా పంచాయతీ ఎన్నికలకు ఈనెల 13న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించారు. ఇందులో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉన్న ఓటర్లను పంచాయతీల వారీగా వార్డుల్లో విభజించారు. వీటిలో ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు స్వీకరించి పరిష్కరించి తుది జాబితాను ప్రచురించారు. జిల్లాలోని 441 గ్రామ పంచాయతీల పరిధిలో 3,836 వార్డులుగా విభజించారు. వీటి పరిధిలో మొత్తం 5,16,183 మంది ఓటర్లు ఉన్నట్లు తేల్చారు. వీరిలో పురుషులు 2,57,529 మంది కాగా, మహిళలు 2,58,647 మంది, ఇతరులు ఏడుగురు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 1,118 మంది అధికంగా ఉన్నారు. ఎన్నికల వరకు పలుసార్లు ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించనున్నారు. 18 ఏళ్లు నిండిన వారు నమోదు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించనుంది. 1 జనవరి 2025 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

శనివారం ప్రచురించిన తుది జాబితా ప్రకారం ఓటర్ల వివరాలు ఇలా.

మండలం	పంచాయతీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
అడ్డాకుల	17	156	12,020	12,127	0	24,147
బాలానగర్	37	308	16,676	16,235	1	32,912
భూత్పూర్	18	168	13,194	13,165	0	26,359
సీసీకుంట	22	212	18,215	19,259	0	37,474
దేవరకద్ర	31	284	22,697	23,259	0	45,956
గండీడ్	49	414	30,900	30,704	4	61,608
హన్వాడ	35	302	19,678	19,739	0	39,417
జడ్చర్ల	45	376	19,913	20,324	0	40,237
కోయిలకొండ	44	380	25,539	25,305	1	50,845
మహబూబ్‌నగర్ (గ్రా)	26	240	18,235	18,610	1	36,846
మిడ్జిల్	24	204	12,308	12,462	0	24,770
మూసాపేట	15	138	10,699	10,606	0	21,305
నవాబుపేట	54	456	26,664	26,044	0	52,708
రాజాపూర్	24	198	10,791	10,808	0	21,599
మొత్తం	441	3,836	2,57,529	2,58,647	7	5,16,183

జాతీయ లోక్‌అదాలత్‌లో 11,037 కేసుల పరిష్కారం



జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి పాపిరెడ్డి

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి 11,037 కేసులను పరిష్కరించారు. మహబూబ్‌నగర్ జిల్లా కోర్టులో 4 బెంచీలు, జడ్చర్ల కోర్టులో 2 బెంచీలు ఏర్పాటు చేసి పరిష్కరించినట్లు జిల్లా న్యాయమూర్తి బి.పాపిరెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీయే రాజమార్గమన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం అందించామన్నారు. కుటుంబ భూ సమస్యను పరిష్కరించి అందరికీ భాగపరిష్కారం చేసినట్లు వివరించారు. బాధితులకు అండగా న్యాయసేవాధికార సంస్థ ఉంటుందని స్పష్టం చేశారు. భార్యాభర్తల గొడవలో ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చారు. సఖ్యతగా సంసారం చేసుకోవాలన్న న్యాయమూర్తులు పూలదండలు మార్చుకోమని వారికి సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.కల్యాణ్‌చక్రవర్తి, ఆర్.శ్రీదేవి, డి.ఇందిర, నిహారిక, ఎస్‌కే భావన, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఉప సూపరింటెండెంట్ జీవీ రమణారెడ్డి, ప్రభుత్వ ప్లీడర్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు హాజరయ్యారు.

జడ్చర్ల : జాతీయ లోక్ అదాలత్ ద్వారా జడ్చర్ల న్యాయస్థానంలో శనివారం మొత్తం 784 కేసులను పరిష్కరించినట్లు న్యాయస్థానం అధికారులు ప్రకటించారు. లోక్ అదాలత్‌లో ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి, మండల లీగల్‌సెల్ అధ్యక్షురాలు లక్ష్మి, న్యాయమూర్తి ముదస్సిర్, న్యాయవాదుల సంఘం సభ్యులు, జంగయ్య, మహేశ్వర్‌రెడ్డి, మాలిక్ షాకీర్, పురుషోత్తం, రమేశ్, అబ్దుల్ కరీం, అశోక్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి : కలెక్టర్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : మత్తు పదార్థాల రహిత జిల్లాగా మహబూబ్‌నగర్‌ను తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మత్తు పదార్థాల నిర్మూలన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో మాట్లాడారు. వచ్చే నెల నుంచి ప్రతి గురువారం ఒక కళాశాలలో కార్యశాల నిర్వహించాలన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో మత్తు పదార్థాల వ్యతిరేక కమిటీలను ఏర్పాటు చేసి అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. యువ పర్యాటక క్లబ్‌లకు కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్పీ, అదనపు కలెక్టర్లు, ముఖ్య అధికారులు కళాశాలల్లో అవగాహన కల్పించాలన్నారు. వచ్చే నెల 17న పాలమూరు విశ్వవిద్యాలయంలో, 24న నర్సింగ్ కళాశాలలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు ఎస్పీ రాములు, ఆర్డీవో నవీన్, డీఈవో రవీందర్ హాజరయ్యారు.



సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

వర్షాల బాధితులకు నష్ట పరిహారం

మహబూబ్‌నగర్ అర్బన్ : భారీ వర్షాలతో జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారాన్ని నిబంధనల ప్రకారం చెల్లించాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టం అంచనాలపై శాఖల వారీగా చర్చించారు. మరోసారి పరిశీలించి నష్టం వివరాలు సమర్పించాలన్నారు. అదనపుల కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, ఎస్.మోహన్ రావు, ఆర్డీవో నవీన్ తదితరులు హాజరయ్యారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

మెట్టుగడ్డ(మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే : ఎస్సీ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి కె.సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకార వేతనాల కోసం ఈ ఏడాది కొత్త విధి విధానాలు రూపొందించినట్లు పేర్కొన్నారు. మొత్తం మూడు దశల్లో ప్రక్రియ ఉంటుందని, తమ ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా తదితర పూర్తి వివరాలను సమర్పించాలని తెలిపారు. ఈ-పాస్ వెబ్‌సైట్‌లో పొందుపర్చిన సూచనల ప్రకారంగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు కలెక్టరేట్‌లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

స్వయంఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ స్వయంఉపాధి కోర్సుల్లో వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ఎంఎస్ ఆఫీస్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, మొబైల్ సర్వీసింగ్, రిఫ్రిజిరేటర్, ఏసీ మరమ్మతుల్లో శిక్షణకు పదో తరగతి ఉత్తీర్ణులు, అనుత్తీర్ణులు అర్హులని, జర్దోసి, మగ్గం, ఎలక్ట్రీషియన్ కోర్సులకు ఏడో తరగతి ఉత్తీర్ణులైన వారికి మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. రాత పరీక్ష అనంతరం వివిధ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. పాత డీఈవో కార్యాలయంలోని వృత్తి నైపుణ్య కేంద్రంలో 94415 65895 నంబరులో సంప్రదించాలని సూచించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడిగా నర్సింహారెడ్డి




మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడిగా మల్లు నర్సింహారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం సీఎంవో నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. మహబూబ్‌నగర్ మండలం కోటకదిరకు చెందిన మల్లు నర్సింహారెడ్డి కాంగ్రెస్ సీనియర్ నేత. ప్రస్తుతం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఇదివరకు కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా పని చేశారు. పార్టీకి నర్సింహారెడ్డి అందిస్తున్న సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆయనకు గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడిగా అవకాశం కల్పించారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి, డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నర్సింహారెడ్డి పేర్కొన్నారు.

మేల్కొంటేనే ముప్పుతప్పు!

మహబూబ్‌నగర్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం సమీపంలోని రైల్వే పైవంతెనకు దానిపై పెరుగుతున్న మొక్కలతో ప్రమాదం పొంచి ఉంది. వంతెన స్తంభాలకు వంతెనను అనుసంధానించే ప్రదేశంలో మొక్కలు పెరిగాయి. ప్రతి స్తంభం వద్ద రావి, మర్రి మొక్కలు ఊడలు దిగుతూ ఎదుగుతున్నాయి. భవిష్యత్తులో వంతెన నెర్రెలు బారే ప్రమాదముంది. మొక్కలు చెట్లుగా మారకముందే అధికారులు మేల్కొని వాటిని తొలగించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

- ఈనాడు, మహబూబ్‌నగర్



1న డైట్ కళాశాలలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: డిప్లొమా ఇన్ ఎలిమెంట్రీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడీ), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) 2024-26లో ప్రవేశం పొందిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని డైట్ కళాశాల ప్రిన్సిపల్ మేరాజుల్లా ఖాన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 1న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ డైట్ కళాశాలలో ప్రవేశం పొందిన అభ్యర్థులు తమ ధ్రువపత్రాలను పరిశీలించుకోవాలని సూచించారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : పాలమూరు పట్టణంలో దసరా ఉత్సవాలకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయించాలని దసర ఉత్సవ కమిటీ ప్రతినిధులు పుర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్‌ను కోరారు. శనివారం పురపాలికలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఘనంగా నిర్వహించేందుకు వేదిక నిర్మాణంతో పాటు వేలాదిగా తరలివచ్చే భక్తులు కూర్చునేందుకు కుర్చీలు, బారికేడ్లు, విద్యుద్దీపాలు, ముఖద్వారాల వద్ద ఆర్చీల నిర్మాణం, పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట మైక్‌సెట్ల ఏర్పాటు వంటివి కల్పించాలని కోరారు. దసరా ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు డా.మురళీధర్‌రావు, అధ్యక్షుడు డా.సీహెచ్.చంద్రయ్య, ధ్వజధారి అచ్చుగట్ల అంజయ్య, కార్యదర్శులు మాల్యాద్రి, రమేష్‌కుమార్, భాస్కర్ గౌడ్, సుబ్రమణ్యం, సురేందర్‌రెడ్డి ఉన్నారు.

అన్ని కులాల అవివాహితులకు సువర్ణావకాశం

నేడు అన్ని కులాల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, అన్ని కులాల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. మహబూబ్‌నగర్ ఈనాడు ప్రాంతీయ కార్యాలయం H.No.: 1-6-65/3, తెలంగాణ చౌరస్తా, సుభాష్‌నగర్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు సంబంధిత కుటుంబీకులు నేడు (29 సెప్టెంబరు 2024, ఆదివారం) ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు 91543 40820 & 91549 92572 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలిపిన నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.



విజయం సాధించిన ఉమ్మడి జిల్లా జట్టు క్రికెటర్లతో ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్

పాలమూరు క్రికెట్ జట్టు శుభారంభం

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-19 వన్డే రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు శుభారంభం చేసింది. శనివారం హన్మకొండ మైదానంలో వరంగల్ జట్టుతో జరిగిన తొలి మ్యాచ్‌లో 34 పరుగుల తేడాతో జిల్లా జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు 34.5 ఓవర్లలో 121 పరుగులకు ఆలౌట్ అయింది. షాదాబ్ అహ్మద్ 38, కనిష్క్ 13, రాంచరణ్ 13, ముఖీత్ 10 పరుగులు చేశారు. అనంతరం వరంగల్ జట్టు లక్ష్య ఛేదనలో చతికిల పడి 29.4 ఓవర్లలో 87 పరుగులకు ఆలౌట్ అయింది. పాలమూరు జట్టు నుంచి ముఖీత్ 3, షాదాబ్ 2, శశాంక్, అంకిత్, కనిష్క్ చెరో వికెట్ తీశారు. విజయం సాధించిన జిల్లా జట్టు క్రికెటర్లను ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, శిక్షకుడు అబ్దుల్లా అభినందించారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నా పెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.



ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న యువతులు, మహిళలు

ఒక్కేసి పువ్వేసి సందమామ!

ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మతో నారాయణపేట ఎమ్మెల్యే డా.పర్ణికారెడ్డి, విద్యార్థినులు



బతుకమ్మతో యువతులు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మ.. సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై వచ్చిన విద్యార్థినులు, అధ్యాపకులతో మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సందడిగా మారింది. చప్పట్లు కొడుతూ వందలాది గొంతుకలు ఒక్కటై ఆలపించిన బతుకమ్మ పాటలు అందరినీ తన్మయత్వానికి లోనుచేశాయి. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా సాగాయి. ముఖ్యఅతిథులుగా మహబూబ్‌నగర్, నారాయణపేట ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, డా.పర్ణికారెడ్డి, రాష్ట్ర అల్ప సంఖ్యాక వర్గాల ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, పుర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ గొప్పతనాన్ని వివరించారు. ఆధ్యాత్మికత, ప్రకృతి పరిరక్షణ ఈ వేడుక పరమార్థమని అభిప్రాయపడ్డారు. అనంతరం విద్యార్థినులతో కలిసి కోలాటం ఆడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు పెద్ద విజయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ రాధికారాణి, ఎన్ఎస్ఎస్ రాష్ట్ర సమన్వయకర్త ముకుందం రమేశ్, కాంగ్రెస్ నాయకులు సిరాజ్ ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్, శివ, నవీన్, ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో యోగా బోధకుల భర్తీకి మౌఖిక పరీక్ష

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆస్పత్రుల్లో యోగా బోధకుల పోస్టుల భర్తీకి ఈ నెల 30న మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రిలోని ఆయుష్ ఉపేంద్ర ఆస్పత్రిలో ఉదయం 10.30 గంటలకు మౌఖిక పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆయుష్ ఉమ్మడి జిల్లా అధికారి డా.ఆదిశేషయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్‌లో 15 మంది పురుషులు, 15 మంది మహిళలు, నాగర్‌కర్నూల్‌లో 19 - పు॥, 19 - మ॥, వనపర్తిలో 9 - పు॥, 9 - మ॥, జోగులాంబ గద్వాలలో 9 - పు॥, 9 - మ॥, నారాయణపేట జిల్లాలో 8 మంది పురుషులు, 8 మంది మహిళలు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు పదో తరగతి లేదా ఇంటర్ విద్యార్హత, ఆరు నెలల యోగా శిక్షణ పొందిన ధ్రువపత్రం కలిగి ఉన్న 45 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. ఆధార్, విద్యార్హత, యోగా ధ్రువపత్రాలతో ఆసుపత్రిలో నివేదించాలని సూచించారు.

కంచే చేను మేస్తే..!

- అక్రమ వసూళ్లతో గాడి తప్పుతున్న పోలీసులు
- ఎవరికి చెప్పుకోలేక బాధితుల అవస్థలు




కందనూలు, న్యూస్‌టుడే : ప్రజలకు రక్షణగా నిలిచి ధన, మాన, ప్రాణ, ఆస్తులను కాపాడాల్సిన రక్షక భటులు కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. అవినీతికి పాల్పడుతూ వ్యక్తిగత విషయాల్లోనూ తలదూరుస్తూ వివాదాస్పదమవుతున్నారు. క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠ దిగజారుతున్నారు. బాధితులు పోలీసులను ఆశ్రయించాలంటేనే జంకే పరిస్థితి ఉంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరిగిన కొన్ని ఘటనలు ఆ శాఖ తలవంపులు తెచ్చేలా ఉన్నాయి. ఉన్నతాధికారులు రంగంలోకి దిగి చర్యలు చేపట్టడమే కాకుండా కేసులు నమోదు చేయడం గమనార్హం.

బెదిరింపులకు పాల్పడి..: మే 15న నాగర్‌కర్నూల్ పట్టణంలోని నల్లవెల్లి రోడ్డు పక్కన బిజినేపల్లి మండలం కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి కారులో తన స్నేహితురాలితో కలిసి భోజనం చేస్తుండగా బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ బ్లాక్‌మెయిల్ చేశారు. రూ. 10 వేలు ఇవ్వకపోతే కొత్త చట్టాల ప్రకారం కేసు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురి చేశారు. గత్యంతరం లేక బాధితుడు రూ. 2 వేలు కానిస్టేబుల్ స్నేహితుని ఖాతాకు అంతర్జాలం ద్వారా చెల్లించారు. బిజినేపల్లి ఠాణాలో విధులు నిర్వహించే మరో కానిస్టేబుల్ ఇదే తరహా బెదిరింపులకు పాల్పడటమే కాక ఫొటోలు కుటుంబ సభ్యులకు చూపడంతో కుటుంబ కలహాలు నెలకొన్నాయి. విషయం వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారులు విచారించి ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు.



నాగర్‌కర్నూల్ : బిజినేపల్లి ఠాణాలో వివరాలు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ (పాత చిత్రం)



బిజినేపల్లి ఠాణాలోని ఓ కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేసిన బాధితుడు

తాత ఫిర్యాదుతో..: బిజినేపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన యువకుడు సురేశ్ అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈనెల 26న గురువారం గ్రామానికి రాగా యువతి తల్లిదండ్రులు యువకుడి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సురేశ్ డయల్ 100కు సమాచారం ఇచ్చారు. బిజినేపల్లి ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ వచ్చి మీకు సహాయం చేస్తానని సురేశ్ నుంచి రూ. 2 వేలు వసూలు చేశారు. విషయం తెలుసుకున్న సురేశ్ తాత వెంకటయ్య శుక్రవారం ఠాణాలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఘటనపై ఉన్నతాధికారులు విచారణ నిర్వహిస్తున్నారు.

నేరుగా రంగంలోకి ఉన్నతాధికారులు..

బిజినేపల్లి మండల పరిధిలో జూదం జోరుగా కొనసాగుతోంది. వారంలో రెండు సార్లు జూదం కేసులు నమోదవుతున్నాయి. పోలీసు సిబ్బంది అక్రమ వసూళ్లకు అలవాటు పడి దాడుల చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. నాగర్‌కర్నూల్ డివిజన్ పరిధిలోని డీఎస్పీ సీసీ రహస్య సమాచారం మేరకు నేరుగా రంగంలోకి దిగి దాడులు చేస్తూ జూదరులను అరెస్టు చేస్తుండడం గమనార్హం.

డయల్ 100ను ఆసరాగా అక్రమ వసూళ్లు


రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా సత్వర న్యాయం కోసం డయల్ 100కు సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పిస్తున్నారు. అందిన ఫిర్యాదులను పరిశీలించకుండా బ్లూకోల్ట్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్తున్నారు. అందిన ఫిర్యాదుల మేరకు ఒకరిద్దరు జరిగిన ఓ చిన్న పొరపాటు పట్టుకుని వారిని బెదిరించి అక్రమ వసూళ్లు చేస్తున్నారు. అలాగే రాత్రి సమయంలో ఒంటరిగా ఉండే జంటల చిత్రాలను తీసి బెదిరింపులకు పాల్పడి వారి వద్ద అందిన కాడికి దండుకుంటున్నారు. గ్రామ, పట్టణ శివారు ప్రాంతాల్లో మద్యం తాగుతున్నట్లు సమాచారం వచ్చినా డబ్బులు వసూలు చేసి వారిని అక్కడి నుంచి తప్పిస్తున్నారు. ఇదే తరహాలో అక్రమ వసూళ్లకు పాల్పడి నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్ అయ్యారు.

సమాచారం ఇచ్చిన వారే లక్ష్యం


కల్వకుర్తి డివిజన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రాత్రి వేళ గుట్టుగా సాగుతుండటంతో గ్రామస్థులు డయల్ 100 ద్వారా సమాచారం ఇస్తున్నారు. సిబ్బంది అక్రమార్కుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తూ ట్రాక్టర్లను విడిచిపెడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిబ్బందిని ప్రశ్నిస్తే గ్రామస్థులపైనే కేసులు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం..

సిబ్బంది క్రమశిక్షణారాహిత్యాన్ని ఉపేక్షించం. అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆరోపణలు వచ్చిన వెంటనే సిబ్బందిపై విచారణ నిర్వహిస్తున్నాం.
- గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఎస్పీ నాగర్‌కర్నూల్



అర్హులందరికీ రూ.2లక్షల రుణమాఫీ: మంత్రి జూపల్లి



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి, పక్కన డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

పాన్‌గల్, న్యూస్‌టుడే : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పథకాలు అమలుచేస్తున్నారని, అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ తప్పక చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం పాన్‌గల్ రైతు వేదికలో విండో మహాజనసభ డీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందని గుర్తుచేశారు. రుణమాఫీకి అర్హులై ఉండి చిన్న చిన్న పొరపాట్లతో కానీ వారికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పర్యాటక, చారిత్రక ప్రాంతాలను ఉచితంగా సందర్శించి జ్ఞానాన్ని పొందాలని మంత్రి సూచించారు. పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం 'తెలంగాణ దర్శిని' కార్యక్రమం అమలుపై విద్యార్థులకు వివరించారు. డీసీసీబీ ఛైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. సింగిల్ విండోల ద్వారా రైతులకు ఇంకా మెరుగైన సేవలు అందించడానికి కృషిచేస్తామన్నారు. అనంతరం రెడ్డిసేవాసమితి ఆధ్వర్యంలో ఛైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, డీపీవో సురేష్, ఎంఈవో శ్రీనివాసులు, విండో వైస్ ఛైర్మన్ బాలయ్య, సీఈవో భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



శేఖర్

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : చేపల వేటకు వెళ్లి నీటిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన తిమ్మాజిపేటలో చోటు చేసుకుంది. ఎస్సై నరేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన శేఖర్ (45) శనివారం ఉదయం చేపలు తీసుకొస్తానంటూ గ్రామ సమీపంలోని రాళ్ల చెరువుకు వెళ్లారు. చేపలు పట్టే క్రమంలో కాలుజారి చెరువులో పడిపోయారు. పక్కనే పొలంలో పనులు చేసుకుంటున్న కొందరు గుర్తించి కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు సమాచారమిచ్చారు. అందరూ వెళ్లి చెరువులో శేఖర్‌ను బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'ప్రభుత్వంపై బీసీల్లో అపనమ్మకం'



ధర్నాలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కల్వకుర్తి, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 10 నెలలు కావొస్తున్నా బీసీ గణనపై ఊసేలేదని ప్రభుత్వ వైఖరితో బీసీ వర్గాల్లో ఆశలు సన్నగిల్లుతున్నాయని భారాస నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో బీసీ మహాసభ ధర్నాకు హాజరైన ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు కావొస్తున్న బీసీ వర్గాలు బడుగులుగానే ఉండటానికి కారకులెవరో చెప్పాలన్నారు. 50 శాతానికి పైగా జనాభా ఉన్న బీసీలకు రిజర్వేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక ఉద్యమానికి కల్వకుర్తి నుంచే శ్రీకారం చుట్టామన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతు రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు బాధ్యత తనదేనని భరోసా కల్పించారు. బీసీలు రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125-00
రిటైల్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

మేమున్నాం.. మీకు తోడుగా.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

మహబూబ్‌నగర్ : 9948145978 | జడ్చర్ల : 8008573899
దేవరకద్ర : 9000031648 | భూత్పూర్ : 8008563143

సమస్య : దేవరకద్ర మండలం నాగారం గ్రామంలో రహదారి గుంతలమయంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి మరమ్మతులు చేసి ఇబ్బందులు తొలగించాలి. **- రవి, నాగారం**

సమాధానం : రహదారికి మరమ్మతులు చేయించి ఇబ్బందులు తొలగిస్తాం. **- సత్యకృష్ణ, ఏఈ, దేవరకద్ర**

(- న్యూస్‌టుడే, దేవరకద్ర గ్రామీణం)

తెరపై ఈనాడు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: శ్రీనివాస - **దేవర** బాలాజీ - **దేవర,** తిరుమల - **దేవర,** వెంకటేశ్వర- **దేవర** వెంకటాద్రి- **దేవర,** శ్రీకృష్ణ - **మత్తు వదలరా 2**

నేడు తైక్వాండో క్రీడాకారుల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి తైక్వాండో అండర్-14, 17 క్రీడాకారుల ఎంపికలను ఆదివారం జిల్లా కేంద్రంలోని డీఎస్ఏ మైదానంలో చేపడుతున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఆర్.శారదా బాయి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్- 14 విభాగంలో 01.01.2011 తర్వాత, అండర్-17 విభాగంలో 01.01.2008 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. బోనఫైడ్, ఆధార్ పత్రాలతో ఉదయం 9 గంటలకు డీఎస్ఏ మైదానం వద్ద 99664 80704 నంబరులో సంప్రదించాలని సూచించారు.

తవ్వకాల్లో బయల్పడిన పురాతన శిల్పం



బాలానగర్, న్యూస్‌టుడే : బాలానగర్ మండలంలోని బోడగుట్టతండా సమీపంలోని ప్రైవేటు పరిశ్రమ ఏర్పాటుకు పనులు చేస్తుండగా శనివారం అక్కడ పురాతన రాతి శిల్పం బయటపడింది. స్థానికులు దాన్ని చూసేందుకు ఆసక్తి చూపారు. ఈ శిల్పం చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై తిరుపాజీని 'న్యూస్‌టుడే' సంప్రందించగా.. తమ దృష్టికి రాలేదని చెప్పారు.

సాయి మందిరంలో వైద్యశిబిరం

మెట్టుగడ్డ (మహబూబ్‌నగర్), న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ కొత్త బస్టాండ్ సమీపంలోని ద్వారకామాయి సాయిమందిరంలో మహబూబ్‌నగర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ నాయకుడు డా.శశికాంత్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆలయంలో వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు వైద్యం అందించటం గొప్ప సేవగా పేర్కొన్నారు. అక్టోబరు 3వ తేదీ వరకు వైద్యశిబిరం కొనసాగుతుందని లయన్స్ క్లబ్ బాధ్యులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు బి.గోవర్ధన్, ఎం.రాములు, కె.ప్రసాద్, పి.సుదర్శన్, కె.బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ జీవితం స్ఫూర్తిదాయకం

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: అభ్యుదయవాదులు, యువత భగత్‌సింగ్ స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి పోరాడాలని సీపీఎం సీనియర్ నాయకుడు కిల్లె గోపాల్ పేర్కొన్నారు. సర్దార్ భగత్‌సింగ్ జయంతి సందర్భంగా శనివారం సీఐటీయూ కార్యాలయంలో చిత్రపటానికి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి , నేతలు చంద్రకాంత్, వేణుగోపాల్, వర్ద గాలన్న, రాజ్‌కుమార్ పాల్గొన్నారు. దివిటిపల్లి రెండు పడక గదుల కాలనీలో జయంతి నిర్వహించారు. వ్యకాసం జిల్లా కార్యదర్శి కడియాల మోహన్, గోపాల్, రాఘవేందర్‌గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

మహమ్మదాబాద్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్సై శేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతి అన్నారు. శనివారం భగత్‌సింగ్ యువజన సంఘం ఆధ్వర్యంలో మహమ్మదాబాద్‌లోని పంచాయతీ కార్యాలయం దగ్గర భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని రక్తదానం చేసిన యువకులను ఎస్సై అభినందించారు. యాదగిరి, వేణు, కృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

ఆటలతో మానసిక వికాసానికి దోహదం

హన్వాడ న్యూస్‌టుడే : క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం హన్వాడలో నిర్వహించిన మండల స్థాయి పాఠశాల క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్థానిక మైదానాలు, పీఈటీల సేవల్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీడీవో యశోద, తహసీల్దార్ కిష్టూనాయక్, ఎంఈవో గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే రామన్నపల్లిలో అదనపు పాఠశాల గదులు, షేక్‌పల్లిలో ఆరోగ్య కేంద్రం, మాదారంలో గ్రంథాలయానికి భూమిపూజ నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్, మార్కెట్ ఉపాధ్యక్షుడు విజయక్‌కుమార్, నాయకులు కృష్ణయ్య, యాదవరెడ్డి, షబ్బీర్ హుస్సేన్, రఘుపతిరెడ్డి, సుధాకర్, నవనీత పాల్గొన్నారు.

నకిలీ దస్త్రాలతో ఇంటి స్థలం విక్రయం.. నలుగురిపై కేసు

శంషాబాద్, న్యూస్‌టుడే: నకిలీ దస్త్రాలను సృష్టించి ఓ ఇంటి స్థలాన్ని విక్రయించిన నలుగురిపై శనివారం శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాలానగర్ మండలం చిన్నరేవెల్లికి చెందిన తిరుమలయ్య-రామేశ్వరమ్మ దంపతులు వ్యవసాయ కూలీలు. ఉపాధి కోసం ఊటుపల్లికి వచ్చి ఓ వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తూ జీవిస్తున్నారు. ఊటుపల్లిలోని ఓ వెంచర్‌లో 240 చదరపు గజాల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసి రామేశ్వరమ్మ పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కుటుంబ అత్యవసర ఖర్చుల కోసం ఈసీఐఎల్‌కు చెందిన శ్రీనివాస్ వద్ద ఇంటి స్థలం దస్తావేజులను పెట్టి రూ.50 వేల రుణం తీసుకున్నారు. ఇంటి స్థలంపై కన్నేసిన శ్రీనివాస్ నగదును తిరిగి చెల్లించినా దస్తావేజులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడు. అనంతరం తనకు తెలిసిన జిలానీ, జ్యోతి, బ్రహ్మంతో కలిసి రామేశ్వరమ్మ ఏజీపీఏ చేసినట్లు నకిలీ దస్తావేజులను శ్రీనివాస్ సృష్టించాడు. సిద్ధాంతికి చెందిన సురేఖకు విక్రయించడంతో ఆమె కుటుంబ సభ్యులు ఇంటి స్థలాన్ని చదును చేశారు. అనుమానం వచ్చిన తిరుమలయ్య మీసేవా కేంద్రంలో ఇంటి రికార్డులను పరిశీలించగా 2024 ఆగస్టు 23న సురేఖకు జిలానీ రిజిస్ట్రేషన్ చేసినట్లు ఉంది. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం



జడ్చర్ల న్యాయస్థానం ఆవరణను శుభ్రం చేస్తున్న న్యాయమూర్తులు లక్ష్మి, ముదస్సిర్

జడ్చర్ల, న్యూస్‌టుడే : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యమని న్యాయమూర్తులు అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లక్ష్మి, అదనపు కోర్టు న్యాయమూర్తి ముదస్సిర్, న్యాయవాదులు, సిబ్బంది జడ్చర్ల న్యాయస్థానం పరిసరాలను శుభ్రం చేశారు. ప్రతి పౌరుడు బాధ్యతగా స్వచ్ఛ భారత్ కోసం కృషిచేయాలని కోరారు. న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, యాదిరెడ్డి, మాలిక్ షాకీర్, విశ్వేశ్వర్, రాములు, హఫీజా, సిబ్బంది దేవా, లింగం, మహేశ్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ పట్టణం : ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం చేపట్టారు. శనివారం రైల్వేస్టేషన్ ఆవరణను శుభ్రం చేశారు. పారిశుద్ధ్యం ఆవశ్యకతపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు డా.కె.కృష్ణమూర్తి, డా.బి.స్వరూప, ఎన్.సుభాషిణి, డా.జె.నరసింహులు, డా.కె.నాగరాజుచారి, బాలరాజు, కళాశాల ప్రిన్సిపల్ డా.కె.పద్మావతి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణవాసులు ఇబ్బందులు లేకుండా ఉంటారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం పురపాలిక కౌన్సిల్ హాలులో అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్, ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్‌తో కలిసి పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కిట్లు, దుస్తులు, స్వచ్ఛ ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పురపాలక సంఘం పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. తరచూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా పరీక్షలు చేయించి మందులు పంపిణీ చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో రాత్రింబవళ్లు పనిచేసి వీధులు, ఇళ్లల్లోకి వరద చేరకుండా కృషిచేసిన కామాటీలు, జవాన్లను ఎమ్మెల్యే అభినందించారు. కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ అప్పయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

భూత్పూర్, న్యూస్‌టుడే : సంపూర్ణ ఆరోగ్యానికి స్వచ్ఛతో పాటు పోషకాహారం కీలకమని భూత్పూర్ పుర అధ్యక్షుడు బస్వరాజుగౌడ్ అన్నారు. స్వచ్ఛతా హి సేవాలో భాగంగా శనివారం స్థానిక కమిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యుల సూచనల మేరకు ఆహారం తీసుకోవాలని, శుభ్రత పాటించాలని పారిశుద్ధ్య కార్మికులకు చెప్పారు. ఈ సందర్భంగా పుర సిబ్బందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు డా.అబ్దుల్ రబ్, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, పర్యవేక్షకులు వసీమ్ సుల్తానా, మహేశ్వరి, సుశీల, పాల్గొన్నారు.



కార్మికులకు దుస్తులు, ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, పుర అధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌గౌడ్

అడ్డాకుల : అడ్డాకులలో టోల్‌గేట్ నిర్వాహకుల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతా హి సేవ నిర్వహించారు. తడిచెత్త, పొడిచెత్తను వేరుగా నిల్వ చేయాలని, ఇంటి పరిసరాలు, పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల నుంచి పురవీధుల గుండా విద్యార్థులు, టోల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సంతబజార్‌లో మానవహారం నిర్వహించి రోడ్లపై చెత్త వేయమని ప్రతిజ్ఞ చేశారు. ఎన్‌హెచ్ఏఐ పీడీ హిమాన్షు గుప్త, ప్రాజెక్టు మేనేజర్ దీపా మాదియా, ప్లాజా మేనేజర్ సంతోష్‌కుమార్, రూట్ మేనేజర్ తేజస్వ రూప్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సురేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో చెత్త సేకరించిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు



చిట్టిబోయినపల్లి గురుకులంలో నిపుణుల వాహనానికి స్వాగతం పలుకుతున్న విద్యార్థినులు

గురుకులాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

జడ్చర్ల, న్యూస్‌టుడే : గురుకులాల్లో సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు సాంఘిమ సంక్షేమ గురుకులాల సంస్థ కొత్తగా ఏర్పాటు చేసిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీం కార్యక్రమాలకు జడ్చర్ల నుంచి శ్రీకారం చుట్టారు. శనివారం నిపుణులతో కూడిన వాహనం చిట్టిబోయినపల్లి బాలికల గురుకులానికి రాగా ప్రిన్సిపల్ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు స్వాగతం పలికారు. ప్లంబింగ్, కార్పెంటర్, ఎలక్ట్రికల్ నిపుణులు గురుకులంలో సమస్యల వివరాలు సేకరించారు. మల్టీజోన్-2 అధికారిణి రజనీ, జోనల్ అధికారి నిర్మల, డీసీవో వాణిశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జనం

మహబూబ్‌నగర్ సాంస్కృతికం : మహబూబ్‌నగర్ పట్టణం మెట్టుగడ్డలోని గిరిజన భవన్‌లో ప్రతిష్ఠించిన మట్టి వినాయకుడి నిమజ్జనాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 21 రోజుల పాటు గణనాథుడిని పూజించిన భక్తులు శనివారం ఊరేగించి కోయిల్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. లడ్డూకు వేలం నిర్వహించగా రూ.27,525 లకు రవి రాథోడ్ దక్కించుకున్నారు. గిరిజన సేవా సంఘం, గిరిజన విద్యార్థి సేవా సంఘం ప్రతినిధులు పురేందర్ రాథోడ్, రమావత్ రవిరాథోడ్, బిచ్చానాయక్, డి.రాజునాయక్ పాల్గొన్నారు.

నవాబ్‌పేట మార్కెట్ కార్యవర్గం ఖరారు

నవాబ్‌పేట, న్యూస్‌టుడే : నవాబ్‌పేట మండల కేంద్రంలోని బాలాజీ వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యవర్గం ఖరారైంది. అధ్యక్షుడిగా పోమాల్ గ్రామానికి చెందిన హరలింగం, ఉపాధ్యక్షుడిగా విస్లావత్ తుల్సీరాం నాయక్, పాలకవర్గ సభ్యులుగా నరేశ్, పద్మమ్మ, నర్సింహులు, వెంకటేశ్, శంకర్‌నాయక్, ప్రభాకర్, లాలయ్య, పురుషోత్తంరెడ్డి, జమీరొద్దీన్, శివకుమార్, చంద్రకాంత్, రాఘవేందర్‌లను ఎంపిక చేసినట్లు తెలిసింది. వీరు త్వరలోనే ప్రమాణస్వీకారం చేయనున్నారు.

రేబీస్ ప్రాణాంతకం



పశు వైద్యశాలలో శునకానికి టీకా వేస్తున్న జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డా.మధుసూదన్‌గౌడ్

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే: రేబీస్ ప్రాణాంతకమని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డా.మధుసూదన్‌గౌడ్ సూచించారు. ప్రపంచ రేబీస్ దినాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని పశు వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఉచిత టీకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుక్కలకు తప్పకుండా టీకాలను వేయించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏలు డా.మమత, శివానందస్వామి పాల్గొన్నారు.

సత్యశోధన గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న గద్వాల కలెక్టర్ సంతోష్ తదితరులు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్ఠ ఆధ్వర్యంలో 'బాపూ బాటలో.. సత్యశోధన' పాదయాత్ర గోడపత్రికను శనివారం తన ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ సంతోష్ ఆవిష్కరించారు. విశ్రాంత జిల్లా విద్యాధికారి విజయ్‌కుమార్, పండిత పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎన్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర అక్టోబరు 2న అలంపూర్‌లోని జోగులాంబ దేవాలయం నుంచి ప్రారంభమై వచ్చే ఏడాది జనవరి 12న అచ్చంపేటలోని ఉమామహేశ్వర దేవాలయం వద్ద ముగించనున్నారు. 100 రోజుల్లో 1000 కిలోమీటర్లు కొనసాగే ఈ యాత్రలో చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలని, మద్యం, మత్తు మందు వాడకాన్ని నివారించాలని, స్వదేశీ వైద్యం ఆదరించాలని, సేంద్రియ వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలని, యోగా, అందరికీ పౌష్టికాహారం, సంపూర్ణ ఆరోగ్యం లాంటి విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. నాగరాజు, వెంకటేశ్, టీసీ నర్సింహులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చాటితే ఉజ్వల భవిత



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికవ్వాలని అర్బన్ మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్, జిల్లా యువజన క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. శనివారం డీఎస్ఏ మైదానంలో అండర్-14, 17 ఎస్‌జీఎఫ్ కబడ్డీ, ఖోఖో బాల,బాలికల పోటీలను ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల స్థాయి పోటీలను సద్వినియోగం చేసుకుంటే జాతీయ స్థాయికి ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి గౌడ్, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు విలియమ్, సాదత్‌ఖాన్, పరశురాం, రమేశ్, మెర్సిఫ్రెంచ్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై వాగు.. వాహనాలు ఆగు



వర్షాలు సమృద్ధిగా కురవటంతో జడ్చర్ల మండలం పోలేపల్లి రంగనాయకచెరువు అలుగు పారుతోంది. ఆ నీరంతా నీరు రోడ్డు మీదుగా పారుతోంది. కిష్టారం నుంచి పోలేపల్లి వైపు వెళ్లే క్రమంలో వాహనాల్లోకి నీళ్లొచ్చి మధ్యలోనే ఆగిపోతున్నాయి. ద్విచక్ర వాహనదారులు, మహిళలు నీటిని దాటేందుకు పాట్లు పడుతున్నారు. ఇక్కడ కల్వర్టు కిందకు ఉండటంతో ఈ పరిస్థితి నెలకొంది. ఎత్తు పెంచి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు. **- న్యూస్‌టుడే, జడ్చర్ల**

నమ్మండి.. ఇది రహదారే!



వాహనాలను చూసి పార్కింగ్ స్థలం అనుకుంటున్నారేమో.. కాదు.. ఇది బాలానగర్ మండల కేంద్రంలో చౌరస్తాలో రహదారిపై నెలకొన్న పరిస్థితి. రోడ్డుకు ఇరువైపులా పలు హోటళ్లు, దుకాణాలు ఉన్నాయి. వాటికి వచ్చేవారు తమ ద్విచ్రకవాహనాలను రోడ్డు పైనే అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. పాదచారులు, ఇతర వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ అద్దె భవనంలో నిర్వహిస్తున్న ఫైనాన్స్‌కు వచ్చే ఖాతాదారులు పదుల సంఖ్యలో రోజూ ద్విచక్రవాహనాలు నిలపడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పోలీసు అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఎస్సై తిరుపాజీని 'న్యూస్‌టుడే' సంప్రందించగా. . ద్విచక్రవాహనాలు నిలపకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. **- న్యూస్‌టుడే, బాలానగర్**

జీవో 25 సవరించాకే ఉపాధ్యాయుల సర్దుబాటు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జీవో 25ను సవరించిన తర్వాతే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్ డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన ప్రసంగించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, బదిలీల పదోన్నతుల అప్పీళ్లను సానుకూలంగా పరిష్కరించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు రవికుమార్, ఆదిత్య, వెంకటేశ్, మహమూద్, నారాయణమ్మ, శ్రీశైలం, ఉమాదేవి, కనకమ్మ, శంకర్, ఖాదరయ్య, విజయలక్ష్మి, శివరాజ్, నరేశ్, అజయ్, సంధ్యారాణి, కురుమయ్య, నాగమద్దిలేటి, వామన్ కుమార్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు, నాయకులు

సీతాఫల గుజ్జు సేకరణపై శిక్షణ



మాట్లాడుతున్న ఏపీడీ జోజప్ప

నవాబ్‌పేట, న్యూస్‌టుడే: నవాబ్‌పేటలోని మహిళా సమాఖ్య కేంద్రంలో పాలమూరు ఫార్మర్ ప్రొడ్యుసర్ ఆర్గనైజేషన్, ఎంఎంఎస్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సీతాఫల గుజ్జు తయారీపై మహిళలకు శిక్షణ నిర్వహించారు. శిక్షణలో ఏపీడీ జోజప్ప, ఎస్సార్పీ ఉమాపతి, దామోదర్, సౌజన్య, సీఈవో వినోద్ గుజ్జు సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం సీతాఫలాల సేకరణను ప్రారంభించి 100 కిలోలు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బాలమణి, కార్యదర్శి యశోద, ఏపీఎం జీవరత్నం, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటికి తంటాలు

దేవరకద్ర పట్టణంతో పాటు పెద్దరాజమూర్, నాగారం గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరికల్ మండలంలో మిషన్ భగీరథ పైపులకు మరమ్మతులు చేపట్టిన నేపథ్యంలో వారం నుంచి గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసినా సరిపోవటం లేదు. జనం ఇబ్బందులు పడుతూ పొలాల బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, దేవరకద్ర గ్రామీణం**



నాగారంలో ట్యాంకర్ నీటిని తీసుకుంటున్న మహిళ

ఇళ్లు కూలిస్తే రోడ్డున పడతాం

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : ఇళ్లను కూలిస్తే వీధినపడతామని, తమను ఆదుకోవాలని తహసీల్దార్ కృష్ణయ్యకు శనివారం మల్లెల పాపయ్యకుంట ప్రాంతవాసులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి పారుదల శాఖ అధికారులు తమ ఇళ్లు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్నాయని, నంబర్లు కేటాయిస్తున్నారని, వాటిని కూల్చొద్దని కోరారు. కార్యక్రమంలో 40 కుటుంబాలకు చెందిన వారు పాల్గొన్నారు



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న బాధితులు

భాజపా బలోపేతానికి కృషి



భగీరథ కాలనీలో భాజపా డిజిటల్ సభ్యత్వాలు అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి పాండురంగారెడ్డి

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : జాతీయ ప్రయోజనాలకు పెద్దపీట వేసే భాజపా బలోపేతానికి మద్దతుగా నిలవాలని భాజపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన మహబూబ్‌నగర్ పట్టణం భగీరథకాలనీలో భాజపా జిల్లా కోశాధికారి పాండురంగారెడ్డితో కలిసి పలువురికి డిజిటల్ సభ్యత్వాలు అందజేశారు. భాజపా నాయకులు, కార్యకర్తలు అన్ని సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తుల ఇళ్లకు వెళ్లి భాజపా సభ్యత్వాలు అందజేసి వికసిత్ భారత్‌లో భాగస్వాములను చేయాలని సూచించారు. దేశం కోసం ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని కోరారు. భాజపా అసెంబ్లీ కన్వీనర్ అంజయ్య, కార్యాలయ కన్వీనర్ సుబ్రహ్మణ్యం, శక్తి కేంద్రం ఇన్‌ఛార్జి రవీందర్‌రెడ్డి, నాయకులు మహేశ్, సంపత్ కుమార్, యాదగిరి, కరుణాకర్‌రెడ్డి, హరినాథ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరవలేనివి

గండీడ్, న్యూస్‌టుడే : విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన ఉపాధ్యాయుల సేవలు మరవలేనివని మండల విద్యాధికారి జనార్దన్, మాజీ సర్పంచి పుల్లారెడ్డి అన్నారు. గండీడ్ మండలంలోని వెన్నాచేడ్ ఆదర్శ పాఠశాలలో 11 ఏళ్లుగా విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించి బదిలీపై ఇతర పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సన్మానించారు. శేరిలింగంపల్లి విద్యాధికారి వెంకటయ్య, పాఠశాల ప్రిన్సిపల్ రైస్ ఫాతిమా, వ్యాయామ ఉపాధ్యాయుడు మహేందర్‌గౌడ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఆలయానికి మైక్‌సెట్టు వితరణ

మిడ్జిల్, న్యూస్‌టుడే : వాడ్యాల గ్రామ శివాంజనేయస్వామి దేవాలయానికి మ్యాకల చంద్రయ్య కుటుంబ సభ్యులు రూ.40 వేల విలువైన మైక్ సెట్టు అందించారు. శనివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి మంగమ్మ, నాయకులు యాదయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.